# విడిచిన రోజా

'సజగ్ నాథ్'

ఆ వూరు వస్తున్నా నన్నమాటేగాని – మన స్వంతా వదిలేసిన వూరులోని స్నేహితున కతి ముఖ్యమయిన సంగతంతా పూర్తిగా చెప్ప లేక పోయానన్న కించతో నే బాధపడుతున్నాను. రైలుబండి ప్లాట్‌ఫారమ్‌పై ఆగింది. నడవ వెంటనే వెళ్ళాను టెలిగ్రాఫ్ ఆఫీసుకి

కౌంటర్ దగ్గరకు వెళ్ళా... ఆరె, ఎవరు చెప్మా! ఇప్పుడు అన్నట్టు ఆడవాళ్ళుకూడా పబ్లిక్ సర్వీసెస్‌లో పని చేస్తున్నారు కదూ!– చూపు మరల్చలేకపోయాను. నిజం చెప్పాలంటే–ఎంతో అందంగా వుంది. అంతే–టెలిగ్రాం పుచ్చుకుంది. పదాలు లెక్క పెట్టింది. కావలసిన డబ్బు తీసుకుంది.

వచ్చేస్తున్నా ... కొట్లాట మొదలైంది. మనసు పరిపరివిధాల పోతోంది... అబ్బ, ఎంత అందంగా వుంది! మెరుపు తీగను మల్లే—వెనక్కి తిరిగి చూశా—ఒక్కమారామెకూడా తిరిగి చూసి నట్లయింది. ఆమెపని ఆమె చేసుకుంటూనే వుంది.

అందంగా వుందికదూ! నా కన్నెయౌవన కళా సమున్నయ మింకా కరుగనే లేదు. ఎంతో ఆకర్షణీయంగా వుంది. ఆ నీలి మేఘపు కాంతి చీరెలో మెరిసి పోతోంది. ఎటువంటి శరీరకాంతి... ముద్దు పెట్టుకుంటేనో—

మరోసారి వెళ్లాను. మాట్లాడాలని కుతూహలంవున్నా—సమయం చిక్కలేదు. మూడో పర్యాయం... వెళ్లాను. ఆమె ఒక్కర్తే వుంది.

ఆమె ముఖం నావైపు తిప్పిందికాదు... కారణం? నాలుగైదు టెలిగ్రాములు యిచ్చాను...ఏదో ఇప్పుడిస్తే ఎన్ని గంటలకు వెళ్తుంది? ఆదివారం ఐతే ఎలాగ? టెలిగ్రాఫ్ స్టేషన్ లేని వూళ్లలో ఎలా? ఏవేవో అసందర్భపు ప్రశ్నలు వేశాను–

ఆమె ఎక్కడా చలించలేదు. చిరాకు అంత కన్నా పడలేదు. నెమ్మదిగా అన్నింటికీ సమాధాన మిచ్చింది.

రోజా అధమం రెండు సార్లయినా వెళ్తూండేవాణ్ణి. ఆమె ఒంటరిగా ఏ సమయాల్లో వుంటుందో తెలుసుగా మరి!

వట్టినే వెళ్ళితే బాగుంటుందా? మర్యాదగా వుండదు. ఏదో పని వుండాలి. అందువల్ల యిచ్చినవాళ్ళకే టెలిగ్రాములు ... స్నేహితులు పిచ్చివాణ్ణయ్యా ననుకుంటారేమో! అనుకోని.

ఈ రోజైనా మాట్లాడాలి...అని అనుకో డమే. రోజూ మనస్సును హెచ్చరిస్తూండ డమే కాని- ఫలితం శూన్యం. తెగింపు చేయా లంటే ధైర్యం?

ఆమె మృదుమధుర పదలాలిత్యం, సుందర గంభీరవదనం, ఆమె ప్రవర్తన, నెమ్మదిలోని చిన్నారి చిలిపితనం "నిన్ను ప్రేమిస్తున్నాను" అని వెలువడే నామాటల కడ్డుపడి, నన్ను ఉక్కిరిబిక్కిరి గావించినై. అంతే—

ఆఖరుకు అనుకున్న దొకటి. జరిగిన దింకొకటి.

"ఒక టెలిగ్రాఫ్ ఫారం..." తడబడుతూ అడిగిన దింతే—

ఎంతకాలం యిలా? ఆఖరుకు ఈ రోజైనా విజయవంతంగా వెళ్లాలనుకున్నా.

టెలిగ్రాం ఫారం తీసుకున్నా—దాని మీద యిలా రాశాను :

'ఫలానా నారికి,
ఫలానా వీధి,
ఫలానావూరు—

కౌంటర్ దగ్గర వుంటున్న అందమైన అమ్మాయిని ఎంతో వెఱ్ఱిగా ప్రేమిస్తున్నా—నేను.

చేతులు వణకసాగేయి ఆ టెలిగ్రాం ఆమెకు అందిస్తూంటే—

ఆమెలో చలనమే లేదు...

ఫారం పుచ్చుకుంది...పదాలు లెక్క పెట్టి సరిగ్గా ఒకరూపాయి పదకొండణాలు అంది.

చలించని రాణి వాసపు స్త్రీల పవిత్రతకు మాత్ర ముగ్ధుణ్నయి—చిల్లరకోసం చూశా.

లేదు...నూరురూపాయల కాగితం వుంది—యిచ్చాను.

నోటును పుచ్చుకొని అన్నిపక్కలా తిప్పి చూసింది. చూసి ఫకాలున ఒక్కసారి నవ్వింది... అంతే- లక్షలు మల్లె పూవులు వికసించినట్టయింది. ఇంకా నవ్వుతోంది... నీళ్ళ గల గల ధ్వనిని మించుతూ నవ్వు ప్రతిధ్వనించింది...అంతే.

"మిగిలిన చిల్లర మీకు కావాలా?" ఆమె అడిగిన దంతే—

(ఒక ఫ్రెంచికథ ఆధారం)